www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 16 సెప్టెంబర్ 2023



జూనియర్ అసిస్టెంట్‌కు రెండేళ్ల జైలు శిక్ష

ప్రజాశక్తి - కడప

జిఎస్‌ఎస్ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ ఎర్రపల్లె ప్రమీలకు కర్నూలు ఎసిబి కోర్టు శుక్రవారం శిక్ష విధించింది. వివరాలు.. కడప ఆలంఖాన్‌పల్లెకు చెందిన ప్రమీల 2016 ఏప్రిల్ 10న ఇ. కిశోర్‌నాయక్ అనే వ్యక్తి నుంచి రూ.4 వేలు లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు పట్టుబడ్డారు. ఎక్స్ గ్రాషి చెల్లింపుకు సంబంధించి జిఎస్‌ఎస్ స్పెషల్ కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించేందుకు ఆమె బాధితుడి నుంచి నగదు తీసుకునేందుకు యత్నిస్తుండగా పట్టుబడ్డారు. ఈ కేసు సంబంధించి కర్నూలు ఎసిబి కోర్టు ఆమెకు రెండేళ్ల సాధారణ జైలు శిక్షతోపాటు రూ. 2 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. కర్నూలు ఎసిబి కోర్టు న్యాయమూర్తి పైతీర్పును ఇచ్చారు.

ఘోర రోడ్డు ప్రమాదం

ఓ రైతు కుటుంబం అద్దె వాహనంలో దైవ దర్శనాలకోసమని బయలుదేరింది. మొదట బసవేశ్వరునికి అభిషేకం చేసుకుని, తమ కుల దైవమైన శ్రీశైల మల్లికార్జునుని దర్శించుకున్నారు. అనంతరం తిరుమలకు వెళ్లి కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరుని దర్శించుకుని తిరిగి శుక్రవారం ఇల్లు చేరుకోవాలనుకున్నారు. గురువారం శ్రీవేంకటేశ్వరుని దర్శన భాగ్యం లభించకపోతే నిరుత్సాహంతో గుడి బయటే దేవుడికి దణ్ణం పెట్టుకున్నారు. రాత్రి 11:30 గంటల ప్రాంతంలో తిరుమల నుంచి నిరుత్సాహంగా తమ ఊరికి తిరుగు ప్రయాణమయ్యారు. బాగా రాత్రి కావడంతో ఒక్కొక్కరుగా తాము ప్రయాణం చేస్తున్న తుఫాను వాహనంలోనే తూలుకుంటూ నిద్ర పోసాగారు. బహుశా డ్రైవర్ కూడా తూలాడేమో... పాపం శుక్రవారం తెల్లవారుజామున 2.30 గంటల ప్రాంతం ఎదురుగా వస్తున్న సిమెంటు లారీని వేగంగా గుద్దుకున్నారు. తుఫాను వాహనం కాస్త తునాతునకలైంది. వాహనంలోని వారందరూ సినిమా పక్కీలో వాహనం అద్దాలు పగిలి, తలుపులు విరిగి బయటకు విసిరేయబడ్డారు. ఆ దృశ్యం చూసిన వారందరి గుండెలు ఝల్లుమన్నాయి. మృతదేహాలను చూసి, క్షతగాత్రుల ఆహాకారాలు వింటూ కళ్లు చెమ్మగిల్లాయి. సమాచారం అందుకున్న పీలేరు, కెవి పల్లి పోలీసులు ఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకుని, సహాయక చర్యలు చేపట్టారు. వివరాల్లోకి వెళితే...



దెబ్బతిన్న లారీ ముందుభాగం



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

- తుఫాన్ వాహనాన్ని ఢీకొన్న లారీ
- కర్నాటకకు చెందిన ఐదుగురు దుర్మరణం
- మృతుల్లో భార్యభర్తలు, తల్లీకూతుళ్లు
- 11 మందికి తీవ్ర గాయాలు
- నలుగురి పరిస్థితి విషమం
- తిరుమల నుంచి తిరుగు ప్రయాణంలో ఘటన
- డ్రైవర్ మినహా మిగిలిన వారందరూ ఒకే కుటుంబీకులు



తుఫాన్ వాహనంలో చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలు

ప్రజాశక్తి-పీలేరు

కర్నాటక రాష్ట్రం, బెళగావి జిల్లా, అథణి తాలూకా, బదలి గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన మొత్తం 15 మంది నాలుగు రోజుల క్రితం తుఫాన్ వాహనం అద్దెకు తీసుకుని శ్రీశైలం, తిరుమల తీర్థయాత్రలకు బయలుదేరారు. గురువారం తిరుమలలో రద్దీ ఎక్కువ కావడంతో దైవదర్శనం దొరక్క రాత్రి 11:30 గంటలకు తమ స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. శుక్రవారం తెల్లవారుజామున కె.వి.పల్లి మండలం మఠంపల్లె సమీపంలో ఆ భక్తుల వాహనాన్ని సిమెంట్ లారీ ఢీకొంది. ప్రమాద సమాచారం అందిన వెంటనే పీలేరు సిఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐ, సిబ్బంది, కలకడ నాగేంద్ర, కె.వి.పల్లి ఎస్ఐ లోకేష్ సిబ్బంది ఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకున్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన బాధితులు 11 మందిని పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం వారిని మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి పంపారు. మృతదేహాలను కూడా శవ పరీక్ష నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుల బంధువులకు సమాచారం అందించారు. వారు బెళగావి నుంచి పీలేరు చేరుకున్నాక మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ మేరకు కెవి.పల్లి ఎస్ఐ లోకేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు, రాయచోటి డిఎస్పీ మహబూబ్ బాషా, సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

మృతుల్లో మరాఠా సమాజానికి చెందిన డ్రైవర్ హనుమంతు సిద్దోలు జాదవ్ (30), లింగాయత సమాజంలో ఒకే రైతు కుటుంబానికి చెందిన దంపతులు అజూరు హనుమంతు(38), అజూరు మనంద (38), తల్లీకూతుళ్లు అజూరు శోభ(36), అజూరు అంబిక(14) ఉన్నారు. గాయపడిన వారిలో అజూరు కస్తూరి, అజూరు మేఘ, అజూరు శివానంద, అజూరు మునియప్ప, అజూరు మల్లప్ప, అజూరు అక్షిత, అజూరు ఉదయ్, అజూరు సునంద, అజూరు మహేష్, అజూరు సాక్షి, అజూరు జనవదాత్ ఉన్నారు. క్షతగాత్రుల్లో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. మృతులు, గాయపడిన వారి బంధువులకు పోలీసులు సమాచారం అందడంతో వారు బెళ్గాం నుంచి పీలేరుకు బయలుదేరారు. వారు పీలేరుకు రావడానికి సుమారు 16 గంటలకుపైగా సమయం పట్టే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.



ప్రమాదంలో మృతి చెందిన డ్రైవర్ హనుమంతు





ప్రమాదంలో మృతి చెందిన భార్యభర్తలు అజూరు హనుమంతు, అజూరు మనంద





ప్రమాదంలో మృతి చెందిన తల్లీకూతుళ్లు అజూరు శోభ, అజూరు అంబిక

ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి : జెసి

ప్రజాశక్తి - కడప



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జెసి గణేష్‌కుమార్

ఖరీఫ్ సాగుకు జిల్లాలోని అన్ని ప్రాజెక్టుల పరిధిలో సరిపడా సాగు నీటి లభ్యత లేని కారణంగా ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటల సాగును ప్రోత్స హించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ జి.గణేష్ కుమార్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో రాష్ట్ర ఉద్యాన సలహాదారు, జిల్లా వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ పి. శివప్రసాద్ రెడ్డి అధ్యక్షతన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. జెసితోపాటు రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుదారు ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జలవనరుల శాఖ ఎస్ఇ మల్లికార్జున రెడ్డి ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జిల్లా పరిధిలోని మొత్తం తొమ్మిది రిజర్వాయర్లన్నింటిలో కలిపి సాధారణ నీటి నిల్వ సామర్థ్యం 54.07 టిఎంసిల కంటే 45 శాతం తక్కువగా 32.740 మాత్రమే నీటి మట్టం ఉందన్నారు. అందులో తాగునీరు, పరిశ్రమల అవసరాలకు పోను ఆయకట్టు పరిధిలోని 66,186 ఎకరాలకు ఖరీఫ్ సాగుకు 13 టిఎంసిల నీరు అవసరం అవుతుందన్నారు. రిజర్వాయర్ల నుంచి నీరు అందుతుందన్న ఆశలు వదిలి ఉన్న నీటి వనరును ఖరీఫ్ సీజన్ ముగిసే వరకు జాగ్రత్తగా వాడుకోవాలని జెసి సూచించారు. వ్యవసాయ శాఖ జిల్లా కమిటీ చైర్మన్ సూచనల మేరకు. కమలాపురం చెరువుకు లింకు చానెళ్లు, హెడ్ రెగ్యులేటర్ల మరమ్మతులు ఏవైనా ఉంటే వెంటనే పూర్తి చేసి నీటిని నిల్వచేసేందుకు చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధి కారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహా దారుదారు మాట్లాడుతూ ప్రతి ఆర్‌బికెలో రానున్న రబీ సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన, వ్యవసాయాధికారులు ఆమోదించిన సీడ్స్, ఫెర్టిలైజర్స్ అందుబాటులో ఉంచాలన్నారు. రాష్ట్ర ఉద్యాన సలహాదారు, జిల్లా వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ మాట్లాడుతూ రైతుల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాలన కొనసాగుతోందన్నారు. ముందస్తు చర్యలుగా ఈ క్రాపింగ్ కూడా చేయించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావు, ఎపిఎంఐపి పీడీ రవీంద్రరెడ్డి, సిఎంఎస్‌ఎఫ్ డిపిఎం రామకృష్ణ, ఆత్మ పీడీ విజయకుమారి, డిసిఒ సుభాషిణి, ఎల్‌డిఎం దుర్గా ప్రసాద్, మైనర్ ఇరిగేషన్ అధికా రులు, పట్టు పరిశ్రమ శాఖ, ఉద్యా నశాఖ, మత్స్యశాఖ, సహ కార, సివిల్ సప్లై, వ్యవసాయ సంబ ంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలివ్వాలి : వ్య.కా.స



సమావేశంలో మాట్లాడుతున్న వి.అన్వేష్

ప్రజాశక్తి - కడప అర్బన్

సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్ అన్వేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 16న కడప ఆర్డీవో కార్యాలయం వద్ద సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని ధర్నా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కడప ఆర్డీవో పరిధిలో ఒంటిమిట్ట, సిద్ధవటం, పెండ్లిమర్రి, ఖాజీపేట, వల్లూరు మండలాలలో ప్రభుత్వ బంజరు భూములలో సాగులో ఉన్నటువంటి పేదల భూ ములకు అసైన్మెంట్ కమిటీ ఏర్పాటు చేసి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఒంటిమిట్ట రెవెన్యూ గ్రామం సర్వే నంబర్ 2050 పొలంలో పేదలు ఏడు సంవత్సరాల నుంచి సాగులో ఉన్నారని తెలిపారు. సిద్ధవటం మండలం పెద్దపల్లి రెవెన్యూ పొలం పెద్దపల్లి దళితులు సాగులో ఉన్నారని చెప్పారు. పెండ్లిమర్రి మండలం పెద్దదాసర్పల్లె రెవెన్యూ పొలం సర్వే నంబర్ 330లో వెల్లటూరు, పెండ్లిమర్రి ఎస్సీ, ఎస్టీ పేదలు ప్రభుత్వ భూముల్లో సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. వీరందరికీ అసైన్మెంట్ కమిటీ ఏర్పాటు చేసి పట్టాలు మంజూరు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. వెంటనే వారందరికీ పట్టాలు మంజూరు చేయాలని కోరారు.

అండర్-19 ఇంటర్ జోనల్ క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభం

ప్రజాశక్తి - కడప

కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) అండర్-19 ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నమెంట్ కడపలోని వైఎస్ రాజారెడ్డి ఎసిఎస్ స్టేడియం, కెఎస్ఆర్ ఎం క్రికెట్ మైదానం, కెఒఆర్ఎం క్రికెట్ మైదానాలలో మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి.

కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో ప్రారంభ రోజు గుంటూరు, రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన గుంటూరు జట్టు 44.3 ఓవర్లలో 180 పరుగులకు ఆల్ అవుట్ అయింది. అనంతరం 181 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు 40.5 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసి 5 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. కెఒఆర్ఎం మైదానంలో నిర్వహించిన మరో మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు పై 48 పరుగుల తేడాతో విశాఖపట్నం జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన విశాఖపట్నం జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లను నష్టానికి 270 పరుగులు చేసింది. అనంతరం 271 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ నార్త్ జూన్ జట్టు 48.1 ఓవర్లలో 222 పరుగులకు ఆల్ అవుట్ అయి ఓటమి చెందింది.

వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో జరిగిన వేరొక మ్యాచ్‌లో కడప జట్టుపై రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు 83 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 215 పరుగులు చేసింది. 216 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన కడప జట్టు 37.0 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 111 పరుగులు చేసింది. వర్షం కారణంతో మ్యాచ్ ఆగిపోవడంతో అంపైర్లు విజెడి పద్ధతి ప్రకారం రిజల్ట్‌ను ప్రకటించారు.

ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి : సిఐ

పోరుమామిళ్ల టౌన్ : వినాయక చవితిని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని పోరుమామిళ్ల సిఐ చిరంజీవి అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఉత్సవ కమిటీ నాయకులతో సమావేశం నిర్వహించారు. పవిత్రమైన పండుగను ఎవరూ అపవిత్రం చేసి అల్లర్లు, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుపుకోవాలని సూచించారు. ఎదుటివారికి ఇబ్బంది కలిగించకుండా పండుగ నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, ఎఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పంట నమోదు పరిశీలన

వల్లూరు : రైతులు పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని కమలాపురం వ్యవసాయ సహాయకులు నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పైడికాలువ, జంగంపల్లి గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి సాయి జ్యోతితో కలిసి పంట నమోదు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం సాగులో ఉన్న పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలియజేశారు. పత్తి పంటలో రసం పీల్చే పురుగుల ఉత్పత్తి ఎక్కువగా ఉందన్నారు. నివారణ కోసం ప్రిఫవిల్ అనే మందును రెండు మిల్లీలీటర్లు నీటిలో లేదా డైఫిల్ థయురాన్ 1.25 గ్రాములు లీటరు నీటిని కలిపి పిచికారి చేయాలన్నారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి రైతు భరోసా కోసం కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు



మాట్లాడుతున్న వెలుగు మండల సమాఖ్య ప్రతినిధి బీబీ

మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలి

కాశినాయన : మండల సమాఖ్య ద్వారా గ్రామాల్లోని డ్వాక్రా సంఘాలు అభివృద్ధి చెందు తాయని వెలుగు ఎపిఎం వీరాంజనేయులు పేర్కొ న్నారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో 15వ వార్షికోత్సవ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 2022- 23 సంవత్సరానికి సంబంధించి ఆర్థిక లావాదేవీలు క్షుణ్ణంగా వివరించారు. ప్రభుత్వం ద్వారా డ్వాక్రా మహిళలకు వచ్చే లబ్ధిని బ్యాంకు ద్వారా కానీ, గ్రామ సంఘాల ద్వారా కానీ రుణాలు తీసుకుని ఏవిధంగా అభివృద్ధి చెందాలో వివరించారు. ఎక్కడ రుణం తీసుకున్నా తప్పకుండా కంతులు సక్రమంగా చెల్లించినట్లయితే డ్వాక్రా మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన అన్నారు. బ్యాంకు లింకేజీ సున్నా వడ్డీ, స్త్రీ నిధి గ్రామ సంఘాల ద్వారా రుణాలు తీసుకుని తిరిగి చెల్లిస్తూ ఉండాలని సూచించారు. ఈ ఏడాది మండల సమాఖ్యకు దాదాపు రూ. రెండు లక్షల ఆదాయం ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో లీగల్ కో-ఆర్డినేటర్ రవికుమార్, పోరుమామిళ్ల ఎపిఎం అశోక్‌రెడ్డి, స్త్రీనిధి, మేనేజర్ సుబ్రహ్మణ్యం, సిసిలు, వివోలు, పలు గ్రామ సంఘాల ప్రతినిధులు, అకౌంటెంట్ రాజశేఖర్ పాల్గొన్నారు.

పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలు

కడప : నిరంతర శ్రమ, మొక్కవోని పట్టుదల ఉంటే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించడంతోపాటు లక్ష్యాలను సాధించవచ్చని ప్రభుత్వ పురుషుల కళాశాల స్వయం ప్రతిపత్తి ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ అన్నారు. ఇటీవల థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్‌లో జరిగిన అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన ఆసియా పసిఫిక్ యోగా ఛాంపియన్ పోటీలలో స్వర్ణ పతకం సాధించిన కళాశాల విద్యార్థి ఎం. శివా నాయక్‌ను ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంటు ఆధ్వర్యంలో ప్రిన్సిపల్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ శివా నాయక్ సాధించిన విజయం, అతని అంకిత భావం గొప్పవని అన్నారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. రమేశ్ మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక వికాసానికి తోడ్ప డతాయని, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో మన కళాశాల విద్యార్థులు పథ కాలు సాధించడం సంతోషాన్నిచ్చే అంశమని అన్నారు. అనంతరం ఆసియా పసిఫిక్ యోగా పోటీల స్వర్ణ పతక విజేత శివానాయక్‌ను శాలువాతో సన్మానించి రూ. 5 వేల నగదు బహుమతి అందజేశారు. గత సంవత్సరం ఆలిండియా, సౌత్ ఇండియా స్థాయి క్రీడా పోటీలలో పాల్గొన్న విద్యార్థులను సన్మానించి, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి ఫిజికల్ డైరెక్టర్ టి.హజరతయ్య పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ

కడప సిటీ : నగరంలోని మురళి హాల్ పక్కన గల ఎంజాయ్ క్రీ పాయింట్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయనున్నామని 23వ డివిజన్ కార్పొరేటర్ తుంగా విజయలక్ష్మి తెలిపారు. శుక్రేరవారం ఆమె విలేకరులతో. మాట్లాడుతూ పదేళ్లుగా ఇక్కడ మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నామన్నారు సంప్రదాయాన్ని కొనసాగిస్తూ సోమవారం నిర్వ హించుకునే వినాయక చవితి కోసం ఆదివారం సాయంత్రం 4.30 నిమిషాలకు విగ్రహాలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. మట్టి విగ్రహాల నిమజ్జనంతో ప్రకృతికి, ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు.

క్రమశిక్షణతో మెలుగుతూ ముందుకెళ్లాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థి దశలో జ్ఞాన సముపార్జన మాత్రమే మీ ఆలోచన కావాలని వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి అన్నారు. శుక్రవారం యోగి వేమన విశ్వవిద్యాలయం కౌన్సెలింగ్ అండ్ గైడెన్స్ సెంటర్, ఎన్ఎస్ఎస్ 1, 4 యూనిట్లు, గుంటూరు ఇదా స్పందన ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయ బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు 'ఆధునిక జీవన విధానంలో ఒత్తిడి తగ్గించుకోవడం ఎలా ? ఆత్మహత్యల నివారణ పై చర్చ' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రిన్సిపల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో మెలుగుతూ ముందస్తు ప్రణాళికలతో మసలుకుంటే ఆటంకాలు ఉండవన్నారు. పరీక్షల సమీపించినప్పుడు ఆందోళనతో సన్నద్ధతను ప్రారంభించడం కాకుండా ముందస్తుగా సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్ సెంటర్ నిర్వాహకులు, సైకాలజీ సహాచార్యులు డాక్టర్ కె. లలిత ఎన్ఎస్ఎస్ యూనిట్ -1 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.సరిత, యూనిట్ -4 పిఒ ఎస్.సునీత, గుంటూరు ఇదా స్పందన ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ప్రతినిధి పి. కిషోర్, వైవీయు ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త వెంకటరామిరెడ్డి విద్యార్థినులకు పలు విలువైన సూచనలు చేశారు. కార్యక్రమంలో విద్యార్థినులు పాల్గొన్నారు

పరిశోధనలో భాష కీలకం

ప్రజాశక్తి - కడప అర్బన్

పరిశోధన రూపకల్పనలో లాంగ్వేజీ అత్యంత కీలకమని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సహాయ ఆచార్యులు డాక్టర్ అప్పస్వామి అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం రీసెర్చ్ స్కాలర్లు వారి పరిశోధనలను ప్రామాణికంగా రూపొందించేందుకు అణువుగా 'రీసెర్చ్ మెథడాలజీ' పై నిపుణులు శిక్షణ ఇస్తున్నారు. శుక్రవారం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఇంగ్లీష్ శాఖ సహాయ ఆచార్యులు డాక్టర్ జాస్తి అప్పస్వామి ప్రొఫెసర్ హాజరై విద్యార్థులకు పరిశోధన నివేదిక తయారీ, ప్రఖ్యాత జర్నల్స్‌కు ఆర్టికల్ రూపకల్పన, పరిశోధన రచన, భాషా శాస్త్రం, పరిశోధన సమీక్ష విషయాలపై అవగాహన కల్పించారు. వైవీయూ పర్యావరణ శాస్త్ర శాఖ సహ ఆచార్యులు డాక్టర్ శ్రీధర్‌రెడ్డి పరిశోధనలో డేటా కలెక్షన్, డేటా అనాలసిస్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సంచాలకులు ఆచార్య చంద్ర ఓబులరెడ్డి మాట్లాడుతూ రెగ్యులర్, పార్ట్ టైం, ఎక్స్ట్రా మ్యూరల్ రీసెర్చ్ స్కాలర్లకు పరిశోధన విధానాలపై ప్రతి శుక్ర, శనివారం నిపుణులను ఆహ్వానించి శిక్షణనిస్తున్నామని చెప్పారు. ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ మార్గదర్శకం మేరకు నాణ్యమైన పరిశోధనలే లక్ష్యంగా ఈ ప్రక్రియ చేపట్టామన్నారు. వేమన యూనివర్సిటీ ఆంగ్ల శాఖ విద్యార్థులకు 'టెస్ట్ ఇన్ ద కాంటెక్స్ట్ (పాఠ్యాంశం క్రియాశీల దృక్పథం)' అనే అంశంపై జాస్తి అప్పస్వామి ఉపన్యాసించారు. కార్యక్రమంలో ఆంగ్ల శాఖ విభాగాధిపతి డాక్టర్ మెర్సీ విజేత, ఆచార్య పుత్త పద్మ, డాక్టర్ ఆర్‌వి. జయంత్ కశ్యప్, అధ్యాపకులు,విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

'సుంకర'ను కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

జనసేన, టిడిపి పొత్తు కారణంగా ఆ పార్టీ నాయకులు శుక్రవారం నగరంలో కడప జనసేన పార్టీ ఇంఛార్జి సుంకర శ్రీనివాసును టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాధవి రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. భవిష్యత్ ఉమ్మడి కార్యచరణ పైన చర్చించారు.



మాట్లాడుతున్న జనసేన, టిడిపి నాయకులు

విత్తన శుద్ధి తప్పనిసరి : కెవికె శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె




మినుములు అందుకున్న రైతులతో శాస్త్రవేత్తలు

ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం రైతులకు మినుములతోపాటు విత్తన శుద్ధి మందులను అంద జేశారు. ఈ సందర్భంగా కె.వి.కె. సమన్వయకర్త డాక్టర్ వీరయ్య మాట్లాడుతూ మినుములో జిబిజి-1 అనే విత్తన రకం రైతులకు అందజేసినట్లు ఆయన తెలిపారు, ఈ రకం విత్తనం విత్తుకోవడానికి అనుకూలంగా ఉంటుందని, ఈ రకం మినుములో వచ్చే పల్లాకు తెగుళ్లను తట్టుకునే పాలిష్ రకమని, పంట వేసిన 70- 75 రోజులకు పంట చేతికి వస్తుందని, ఎకరాకు 8 నుంచి 9 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని ఆయన పేర్కొన్నారు. విత్తనం విత్తితేటప్పుడు ఎకరానికి 8 కిలోల నత్రజని 20 కిలోల భాస్వరం ఉండే ఎరువులు వాడాలని ఆయన సూచించారు. అనంతరం ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలని వీటిలో ఇమిడ క్లోరి ప్రైడ్, మాకోజబ్ కలిపి విత్తన శుద్ధి చేయడం వల్ల తొలి దశలో వచ్చే ఎండు తెగులు, రసం పీల్చే పురుగుల నుంచి మొక్కలను కాపాడుకోవచ్చని వివరించారు. విస్తరణ శాస్త్రవేత్త మహేష్ బాబు మాట్లాడుతూ రైతులకు సామూహిక ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రాల ద్వారా మినుము పంట సాగును ప్రోత్సహించడంతోపాటు, రైతులకు యా జమాన్య పద్ధతులపై శిక్షణా కార్యక్రమాలు, పంట సస్యరక్షణకు అవసరమైన మందులను అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు శిల్పకళ, సాయి మహేశ్వరి, మానస, ప్రశాంతి, మండల పరిధిలోని బుసిరెడ్డి పల్లె, ఆపరాజుపల్లి, రైతులు పాల్గొన్నారు.

సేవలకు డబ్బులు వసూలు దుర్మార్గం : కాంగ్రెస్

ప్రజాశక్తి - కడప/రిమ్స్



రిమ్స్‌లో ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఉచితంగా వైద్యం అందించాల్సిన ప్రభుత్వాస్పత్రిలో ఎంఆర్ఐ స్కాన్ రిపోర్టులకు డబ్బులు వసూలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు విష్ణు ప్రీతమ్‌రెడ్డి ఆరో పించారు. శుక్రవారం ఆయన పార్టీ కార్యకర్తలతో కలిసి రిమ్స్ ఆసుపత్రిలో పర్యటించారు. ఈ క్రమంలో కొందరు రోగులు ఆయన వద్దకు వచ్చి ఎంఆర్ఐ స్కాన్ రిపోర్టులకు రూ. 250 (ఒక కాపీకి) వసూలు చేస్తున్నారని విన్నవించారు. అనంతరం ఎంఆర్ఐ స్కాన్ సెంటర్ దగ్గరికి వెళ్లిన విష్ణు ప్రితమ్ రెడ్డి అక్కడ జరుగుతున్న అవినీతిపై సంబంధిత (ప్రమోదిని డయాగ్నస్టిక్ సెంటర్) యాజమాన్యాన్ని నిలదీసి వారితో వాగ్వాదానికి దిగారు. డబ్బులు వసూలు చేయడం అక్రమమని, అలాంటి వారి పైన చర్యలు తీసుకోవాలని ఆయన అక్కడ బైఠాయించి నిరసన తెలియజేశారు. ఆరు ఆరేళ్ల నుంచి ఈ విధంగా డబ్బులు వసూలు చేస్తూ రోగుల దగ్గర నుంచి ప్రమోదిని డయాగ్నస్టిక్ సెంటర్ యాజమాన్యం వందల కోట్ల రూపాయలు అక్రమంగా ఆర్జించారని పేర్కొన్నారు. సెంటర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని అధికారులను హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చార్లెస్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మధు రెడ్డి, అనుబంధ సంఘాల అధ్య క్షులు చెప్పలి పుల్లయ్య, హ్యూమన్ రైట్స్ పాలగిరి శివ, మామిళ్ళ బాబు, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గంగాధర్, నగర మహిళ అధ్యక్షురాలు లావణ్య,రాష్ట్ర నాయకులు లక్ష్మయ్య, శ్రీహరి, చంద్ర,హబీబ్, ఆనంద్ పాల్గొన్నారు.

ఖోఖో పోటీలకు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని స్థానిక ఇంటర్‌నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు గోవాలోని ఖోఖో పోటీలలో సుమారు 21 మంది విద్యార్థులు పాల్గొనడం సంతోషమని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ ఎం.వివేకానంద రెడ్డి తెలిపారు. తమవిద్యాసంస్థల్లో విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల్లో కూడా మంచి నైపుణ్యాన్ని ప్రదర్శించాలని తెలిపారు. ఇప్పటికే తమ సంస్థలో చదివిన విద్యార్థులు ఎందరో ఉన్నత స్థాయిలో ఉన్నారని చెప్పుకోవడం గర్వంగా ఉందన్నారు. ఎంతోమందికి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సంపాదించుకున్నరని తెలిపారు. కార్యక్రమంలో పిఇటి జయచంద్ర, లక్ష్మయ్య, నాగార్జున పాల్గొన్నారు.


చీనీ కాయలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్న మార్కెట్ కమిటీ అధికారులు

దళారీ వ్యవస్థ నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం

- మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మార్కెట్లో దళారుల వ్యవస్థ నిర్మూలించడమే ప్రభుత్వ ధ్యేయమని మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప అన్నారు. పులివెందుల మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీ కాయల బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నప్ప మాట్లాడుతూ గతంలో రైతుల వద్దకు వెళ్లి సూట్ పేరుతో వ్యాపారులు పది టన్నులకు రెండు టన్నులు తీసుకుంటూ అన్యాయం చేసేవారన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చొరవ తీసుకొని పులివెందుల మార్కెట్ యార్డులో చీనీ మార్కెట్‌ను ఏర్పాటు చేసి రైతులు నేరుగా ఇక్కడికి తెచ్చి సూట్ లేకుండా అమ్ముకునేలా ఏర్పాటు చేశారన్నారు. నచ్చిన ధరకు రైతు చీనీ కాయలు అమ్ముకోవచ్చన్నారు. సూట్ లేకుండా టన్ను రూ.26 వేలకు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి చీనీ రైతు సద్వినియోగం చేసుకోవాలని చిన్నప్ప కోరారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మార్చాలని వినతి

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు సర్వాయిపల్లి రోడ్డులో అద్దె భవనలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని టిడిపి నాయకులు కోరారు. శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ విజయ్‌రామరాజు, ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డికి ఎపి రవీంద్ర, పాశం మారుతి వినతి పత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ప్రొద్దుటూరు రోడ్డులోని పాత మున్సిపల్ కార్యాలయంలోకి పాత తహశీల్దార్ కార్యాలయంలోగానీ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. 7వ వార్డులోని చిలుంగారి వీధి, చర్చి వద్ద రోడ్డు అధ్వాన్నంగా ఉన్నాయని రవీంద్ర ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆ రెండు ప్రదేశాల్లో వెంటనే రోడ్ల నిర్మాణం చేపట్టాలని పురపాలక కమిషనర్‌కు, అసిస్టెంట్ ఇంజనీర్‌కు ఎమ్మెల్యే సూచించారు. రోడ్డు నిర్మాణం చేపట్టి ఆ వార్డు కౌన్సిలర్ సుమలతచే ప్రారంభింపజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ వెంకటరమణ, తహశీల్దార్ అనురాధ, మునిసిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, మునిసిపల్ కమిషనర్ రంగస్వామి, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే ఉన్నత స్థాయికి

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యార్థులు క్రమ శిక్షణతో మెలిగినప్పుడే ఉన్నతస్థాయికి చేరుకొనేందుకు అవకాశం ఉందని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నారాయణమ్మ తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ప్లస్ టూ పాఠశాలలో డ్రెస్సెస్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు రెగ్యులర్‌గా కళాశాలకు హాజరుకావాలన్నారు. పాఠ్యాంశాలను శ్రద్ధగా విని నేర్చుకోవాలని కోరారు. తెలుగు అధ్యాపకుడు చెరుకూరి శ్రీనువాసులు మాట్లాడుతూ విద్యార్థులు పెట్టుకున్న లక్ష్యం కోసం నిరంతరం కష్టపడాలని సూచించారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేందుకు ఇప్పటి నుండే కష్టపడాలన్నారు. కౌమర దశలో ఉన్న విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పిజిటిలు వెంకట్, రమేష్, కృష్ణవేణమ్మ, రాధా, రెడ్డి సాయి, సురేష్‌కుమార్ రెడ్డి, గుర్నాథ్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సూచిక బోర్డు సరిచేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

బైపాస్ రోడ్డులోని జమ్మలమడుగు, పెద్దపసుపుల సూచిక బోర్డు దారులు మార్పు, తప్పుగా ఏర్పాటయ్యాయని, వాటిని సరిచేయాలని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్‌అండ్‌బి ఎఇ రామకృష్ణారెడ్డికి వినతిపత్రమిచ్చారు. ఇందుకు ఎఇ స్పందిస్తూ బోర్డును సరిచేస్తామని హామీ ఇచ్చారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్, నాయకులు కృష్ణారెడ్డి, రాఘవ పాల్గొన్నారు.


రూ.1.23 లక్షల రికవరీకి నోటీసులు జారీ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలో ఉపాధి హామీ పథకం కింద జరిగిన అవకతవకల్లో రూ. 1.23 లక్షలు రికవరీకి ఆదేశించినట్లు ఎంపిడిఒ కృష్ణమూర్తి తెలిపారు. గత నెల 29న 'శిలాఫలకాల ఏర్పాటులో నిర్లక్ష్యం' అనే శీర్షికతో 'ప్రజాశక్తి'లో కథనం ప్రచురితమైంది. ఇందుకు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ యధుభూషన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా విజిలెన్స్ అధికారి యోగాంజనేయరెడ్డి, ఎపిడి సుబ్బారెడ్డి విచారణ చేపట్టారు. ఈ విచారణలో శిలాఫలకాలు ఏర్పాటులో అక్రమాలు జరిగినట్లు ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. ఆ మేరకు అధికారులు బాధ్యులైన ఉపాధి ఎపిఒ, ఇసిలకురూ.1.23 లక్షలు రికవరీకి ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన వివరించారు.

జనసేనను తాకట్టు పెట్టడం శోచనీయం

ప్రజాశక్తి - వేంపల్లె


మాట్లాడుతున్న మాజీ సర్పంచు చలపతి

చంద్రబాబు పాదాల వద్ద జనసేన జెండాను తాకట్టు పెట్టి కాపులను మోసం చేయడం జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు తగదని ఇడుపులపాయ మాజీ సర్పంచ్ పోతిరెడ్డి చలపతి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జనసేన పార్టీ అంటే జనాలకు మోసం చేసే పార్టీగా మారిందని విమర్శించారు. జగనన్నను ఒంటరిగా ఎదుర్కోలేక అనైతికంగా చంద్రబాబు, పవన్ కలిశారన్నారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన కాపు సామాజిక వర్గానికి నాయకుడని అంటూ జనసేన పార్టీ ఏర్పాటు చేసి, కాపు ప్రజలలో, కాపు విద్యార్థులలో ఒక ఆశను కలిగించి సర్వనాశనం చేయడం శోచనీయమన్నారు. ఒంటరిగా జనసేన పార్టీ పోటీ చేస్తే రెండవ స్థానంలో ఉండేదని తెలిపారు. ప్యాకేజీ కోసం, స్వార్థం కోసం పవన్ కళ్యాణ్ జనసేన పార్టీని పెట్టి కాపు సామాజిక వర్గం ప్రజలను మోసం చేయడం దుర్మార్గమని ఆరోపించారు. కాపు సామాజిక ఓట్లు అడిగే అర్హత పవన్‌కు లేదన్నారు. కాపు సమాజానికి అన్ని విధాలా అండగా ఉంటున్న జగన్‌మోహన్‌రెడ్డిని 2024లో మళ్లీ సిఎం చేయడానికి కాపులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సమావేశంలో కాపు నాయకులు పోతిరెడ్డి మహేష్, కొండయ్య, పెద్ద జయచంద్రుడు, సాయినాథ్, చెంద్రాయుడు, శేఖర్ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

వేంపల్లె : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండొచ్చని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఓబుల్‌రెడ్డి అన్నారు. వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1,2 ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛత హై సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక పుల్లయ్య తోట వీధిలోని ప్రాథమిక పాఠశాలలో చెత్త సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ యూనిట్ ద్వారా వేంపల్లెలోని ఆయా ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న ఇంటి యజమానులకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. అధ్యాపకులు డాక్టర్ మల్లేశ్వరమ్మ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

రేపు గద్దర్ సంస్మరణ సభ

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ప్రజా గాయకుడు గద్దర్ సంస్మరణ సభను ఆదివారం ఉదయం స్థానికంగా నిర్వహిస్తున్నామని గద్దర్ సంస్మరణ కమిటీ ప్రొద్దుటూరు నాయకులు తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ స్థానిక బిటి రోడ్డులోని మార్కెట్ యార్డులో గద్దర్ సంస్మరణ సభ నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలు విడుదల చేశారు. విరసం సభ్యులు వరలక్ష్మి, చైతన్య మహిళా సంఘం కన్వీనర్ పద్మ, ప్రజా నాట్యమండలి స్టేట్ కన్వీనర్ పల్లవోలు రమణ, మాల మహానాడు రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మురళీ ప్రసాద్, దళిత సమాఖ్య నాయకులు యల్లయ్య, బిఎస్పీ జిల్లా అధ్యక్షుడు జయరాం పాల్గొన్నారు.

నాటి సత్రమే.. నేటి సచివాలయం

నాలుగేళ్లుగా సత్రం నుంచే సేవలు.. నత్తనడకన నూతన భవన నిర్మాణ పనులు

ప్రజాశక్తి - పెద్దముడియం

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఏర్పాటు అనంతరం ప్రజలకు ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థ ద్వారా అనేక సేవలు అందిస్తోంది. మండలంలోని చిన్నపసుపల గ్రామంలోని తరాలనాటి సత్రాన్ని సచివాలయంగా చేసుకొని నాలుగేళ్లుగా అధికారులు ప్రజలకు సేవలను కొనసాగిస్తూ వస్తున్నారు. కనీస సౌకర్యాల్లేక ఇబ్బందుల మధ్య విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో రూ.40లక్షలతో నూతన సచివాలయ భవనానికి శ్రీకారం చుట్టి మూడేళ్లు గడచినా పనులు నత్తనడకన పనులు సాగుతున్నాయి. ఇక ఎంతకాలం ఇబ్బందికరంగా ఈ సత్రంలో సేవలు అందించాలోనని సచివాలయ సిబ్బంది వాపోతున్నారు. త్వరగా నూతన సచివాలయం నిర్మించాలని వారు కోరుతున్నారు.

త్వరలో నిర్మాణం పూర్తికి చర్యలు : ఎఇ శ్రీనివాసులు



కాంట్రాక్టర్‌కు నిర్మాణ పనుల నిమి త్తం కొన్ని రావలసిన బిల్లులు ఆగిపోయాయి. దీంతో పనులు ఆలస్యం అవుతున్నాయి. కాంట్రాక్టర్‌తో మాట్లాడి వెంటనే సచివాలయ నిర్మాణ పనులు పునఃప్రారంభించి అక్టోబర్‌లో పూర్తి చేస్తాం.


నిర్మాణంలో ఉన్న సచివాలయం

సమస్యలు మండల స్థాయిలోనే పరిష్కారం

- 'జగనన్నకు చెబుదాం'లో కలెక్టర్ వి.విజయ్‌రామరాజు


ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చాపాడు

గ్రామ స్థాయిలోని సమస్యలను మండల స్థాయిలోనే అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని కలెక్టర్ వి.విజయ్‌రామరాజు అధికారులను ఆదేశించారు. మైదుకూరు ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మండలస్థాయి జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు మైదుకూరు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, జెసి గణేష్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, బద్వేలు ఆర్‌డిఒ వెంకటరమణ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి రాలేని వారి సమస్యలను స్థానికంగానే పరిష్కరించే దిశగా మండలస్థాయిలో ప్రతి బుధ, శుక్రవారాల్లో ఒక్కో రోజు ఒక్కో మండలంలో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అందిన దరఖాస్తులను ఆయా శాఖల అధికారులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. పరిష్కార నివేదికలు స్పష్టంగా ఉండాలన్నారు. ఇందులో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిజమైన ప్రజల వద్దకు పాలన ఈ రోజు మైదుకూరు పట్టణంలో ప్రత్యక్షంగా, సుస్పష్టంగా దర్శనమిస్తోందని ప్రశంసించారు. జిల్లాస్థాయి అధికారులు మొత్తం మైదుకూరు మండలంలో తిష్టవేసి గ్రామాల్లో సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు. స్థానిక ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోహం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు, తహశీల్దార్ అనురాధ, ఎంపిడిఒ రమణారెడ్డి, మండలస్థాయి అధికారులు, మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, మండలాధ్యక్షులు థామస్, ఉప మండ లాధ్యక్షులు రఘురామిరెడ్డి, తిప్పిరెడ్డిపల్లె సర్పంచు బండి నాగేంద్రప్రసాద్, వైసిపి నాయకులు కిరణ్మయి, ప్రజలు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్‌కు స్థలం కేటాయించాలని వినతి

మైదుకూరులో ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని మైదుకూరు నియోజకవర్గ, మండల పాత్రికేయులు కలెక్టర్ వి.విజయ్ రామరాజుకు అర్జీ ద్వారా విన్నవించారు. ఇందుకు ఆయన స్పందిస్తూ రాష్ట్ర సమాచార కమిషనర్ నుండి అనుమతి తెచ్చుకుంటే మైదుకూరు మండల కేంద్రంలో తప్పకుండా ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి కేటాయిస్తామన్నారు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డి చొరవతో అప్పటివరకు తెలుగుగంగ క్వార్టర్స్‌లో నిరుపయోగంగా ఉన్న ఒక భవనాన్ని ప్రెస్‌క్లబ్ నిర్వహణ కోసం కేటాయించమని మైదుకూరు మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలి


కడప : సత్కారం అందుకున్న ఇంజినీర్లు

ప్రజాశక్తి- కడప అర్బన్

ఇంజినీర్లు మన జాతి భవిష్యత్తును బలంగా నిర్మించే శక్తిగల వారని ఎపిఎస్‌పిడిసిఎల్ డిఇ వీరభద్రయ్య అన్నారు. ఇంజినీరింగ్ దిగ్గజం భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ కడప, అన్నమయ్య అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి, కార్యదర్శి కొండూరు జనార్ధన్ రాజు శుక్రవారం తన కార్యాలయంలో 12 మంది ఇంజినీర్లను సత్కరించారు. ముఖ్య అతిథిగా లయన్స్ అడ్మినిస్ట్రేటర్ కె.చిన్నపరెడ్డి పర్యవేక్షణలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇ మాట్లాడుతూ ఇంజినీరు సమాజంలో ఎంతో బాధ్యత వహించాల్సి ఉంటుందని, తెలుగు జాతికి, భారతదేశానికి గర్వకారణమైన మోక్షగుండం విశ్వేశ్వరయ్య చూపిన బాటలో నడవాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఇంజినీర్ పుత్తా పుల్లారెడ్డి, ఎద్దుల చిన్నప్పరెడ్డి, ఎ.ముకుందారెడ్డి, గంజికుంట గణేష్, వల్లెంకొండు సుమేష్‌లను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అనంతరం బ్యాంకు ఆఫ్ బరోడా మేనేజర్ మధుమోహన్‌తోపాటు మరో ఐదుగురు సంస్థ ఇంజినీర్లను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ కోశాధికారి దేవతి రవి, పూర్వ అధ్యక్షులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, సభ్యులు పద్మప్రియ చంద్రారెడ్డి, గంగాధర్, జి.కోటేశ్వరరావు పాల్గొన్నారు. **చింతకొమ్మదిన్నె :** స్థానిక అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో భారతరత్న శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 163వ జయంతిని పురస్కరించుకొని ఇంజినీరింగ్ డేని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కడప ఆర్‌అండ్‌బి కార్యనిర్వాహక ఇంజినీర్ ప్రభాకర్, కడప టూరిజం కార్పొరేషన్ ఇంజినీర్ పెంచలయ్య హాజరై మాట్లాడారు. తిరుమలఘాట్ రూప కల్పన చేసిన గొప్ప వ్యక్తి శ్రీమోక్షగుండ విశ్వేశ్వరయ్య అని తెలిపారు. కళాశాల చైర్మన్ చొప్ప గంగిరెడ్డి, వైస్ చైర్మన్ ఎల్లారెడ్డి మాట్లాడుతూ నీతి నిజాయితీకి మారుపేరు శ్రీమోక్షగుండం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్ రెడ్డి, అన్ని విభాగాధిపతుల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. **వేంపల్లె :** మోక్ష గుండం విశ్వేశ్వరావును ఇంజనీర్లు ఆదర్శంగా తీసుకొని దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపించాలని కడప, కర్నూలు పంచాయతీ రాజ్ క్వాలిటీ కంట్రోల్ విభాగం ఇఇ పి.నాగేశ్వరరెడ్డి సూచించారు. ఇంజనీర్స్ డే సందర్భంగా శుక్రవారం మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటిలో మోక్ష గుండం విశ్వేశ్వరావు చిత్ర పటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మనిషి మేధస్సుకు శాస్త్రీయత తోడైతే మహాద్భుతాలు సృష్టించవచ్చని నిరూపించిన మహనీయుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అన్నారు. సివిల్ ఇంజనీరుగా, ఆర్థికవేత్తగా, నీటి యాజమాన్య నిపుణిడిగా, అనేక డ్యాముల నిర్మాతగా బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించి దేశ ఆర్థిక పరిపుష్టి, ప్రపంచ ప్రగతికి బలమైన పునాది వేసిన వ్యక్తి అన్నారు. వేంపల్లెలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కూడా మోక్షం గుండం విశ్వేశ్వరావు చిత్ర పటానికి ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు ఘనంగా నివాళ్ళుర్పించారు. కార్యక్రమంలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం హెచ్ఒడి రమేష్, అనిల్‌కుమార్ రెడ్డి, వెంకటేష్, ధనుంజయ, విద్యార్థులు పాల్గొన్నారు. **చాపాడు :** స్థానిక చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ కళాశాలలో శుక్రవారం భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని ఇంజనీర్స్ డేగా ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఇస్రో మాజీ జనరల్ మేనేజర్ జె.గోపాల కృష్ణ మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య గొప్ప సివిల్ ఇంజినీర్‌గా పేరు తెచ్చుకున్నారన్నారు. ఆయన నిర్మించిన ఎన్నో అద్భుత కట్టడాలు నేటికి స్థిరంగా ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన నమూనాలను పరిశీలించి బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి, చైర్మన్ డాక్టర్ వి.జయచంద్రరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : పట్టణంలోని లయోలా పాలిటెక్నికల్ కళాశాలలో శుక్రవారం ఇంజనీరింగ్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా కళాశాల విద్యార్థులు 104 రకాల ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శించారు. ఈ ప్రాజెక్టుల్లో ఎలక్ట్రానిక్ వెహికల్ ఎంతగానో ఆకట్టుకుంది. కళాశాల కరస్పాండెంట్ అంటోనీ, ప్రిన్సిపల్ బిస్ట్రో, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

సెంటర్ పార్కింగ్‌తో ఇబ్బందులు

- కౌన్సిలర్ ఇర్ఫాన్‌బాషా

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ప్రొద్దుటూరులో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని పరిష్కరిం చేందుకు చర్యలు తీసుకోవాలంటూ 13వ వార్డు కౌన్సిలర్ ఇర్ఫాన్‌బాషా శుక్రవారం ఎఎస్‌పి ప్రేరణకుమార్, ట్రాఫిక్ సిఐ యుగంధర్‌కు వినతి పత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణం కోనేటి కాల్వ వీధి, శివాలయం వీధి, హోమస్‌పేట, బంగారు అంగళ్ళు ప్రాంతాల్లో సెం ట్రల్ పార్కింగ్ ఏర్పాటు విషయంలో ఆటో స్టాండ్లు, తోపుడుబండ్లు కొం దరు స్థలాలను రిజర్వేషన్ చేసుకొని రోప్ కట్టుకోవడం వల్ల వాహనదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. పార్కింగ్ స్థలాలు చాలా ప్రాంతాల్లో లేకపోవడంతో వాహనదారులు రోడ్లపైనే వాహనాలు నిలపడం వల్ల భారీ వాహనాలు వచ్చిన సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందన్నారు. పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాలను గుర్తించాలని, కొందరు నిర్మాణదారులు వర్కింగ్ స్థలాలు వదలకుండా నిర్మాణాలు చేస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఇర్ఫాన్ బాషా కోరారు.

చేపలు, కోళ్ల పెంపకంతో రైతులకు లాభాలు

పులివెందుల టౌన్ : కొర్రమేను చేపల యూనిట్, గుడ్లు పెట్టె కోళ్ల యూనిట్ ద్వారా రైతులు ఎక్కువ లాభాలు పొందవచ్చునని మంజీరా ఆక్వా కల్చర్ చైర్మన్ శంకర్రావు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని రైతు పరిశోధన సంస్థ కార్యాలయం వ్యవసాయ రంగంలో భాగంగా కొర్రమేను చేపల యూనిట్, గుడ్లు పెట్టె కోళ్ల యూనిట్ గురించి రైతు పరిశోధన సంస్థ అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ఎస్‌కి వివరించారు. మార్కెటింగ్ ఎలా చేసుకోవాలి వంటి పూర్తి వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా రైతు పరిశోధన సంస్థ ద్వారా రైతులకు చేస్తున్న సేవకు గుర్తింపుగా సంస్థ అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ఎస్‌ను ఘనంగా సన్మానించారు.

ఇసుక దందాపై చర్యలు తీసుకోవాలి

వేంపల్లె : వేంపల్లెలోని పాపాఘ్ని నది నుండి అక్రమంగా తవ్వకాలు చేస్తున్న ఇసుక దందాపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమ్‌అద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా డిమాండ్ చేశారు. శుక్రవారం పాపాఘ్ని నదిలో ఉన్న గుంతలను ఆప్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా రహంతుల్లా మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా చేయడం వల్ల పాపాఘ్ని నది అంతా గుంతలమయం అయిందన్నారు. పత్రికల్లో కథనాలు వస్తున్నా మండల అధికారులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హమన్నారు. కార్యక్రమంలో ఆమ్‌అద్మీ పార్టీ నాయకులు దాదాపీర్, జిల్లా రైతు కన్వీనర్ మౌలాలి, అహమ్మద్, తాజ్, మండల కన్వీనర్ గౌస్, సమీర్ పాల్గొన్నారు.

అండర్-15 ఫుట్‌బాల్ పోటీల్లో 'బీరం' విద్యార్థుల ప్రతిభ

ఖాజీపేట : విజయవాడ నలంద స్కూల్లో జరిగిన ఫుట్‌బాల్ అండర్-15 బాలుర విభాగంలో బీరం శ్రీధర్‌రెడ్డి పాఠశాల 10వ తరగతి విద్యార్థులు జానకీరామ్, యశ్వంత్, తనిష్క్ అత్యున్నత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి తెలి పారు. ఈ సందర్భంగా బీరం సుబ్బారెడ్డి, చైర్ పర్సన్ సరస్వతమ్మ, డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనందుకు హర్షం వ్యక్తం చేశారు. జాతీయస్థాయిలో బీరం పాఠశాల పేరును నిలబెడతారనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. వ్యాయామ శిక్షణ ఉపాధ్యాయుడు శివప్రసాద్‌ను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్వేతా, కళాశాల ప్రిన్సిపల్ హేంచందర్, పిఇటిలు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్లకు బారికేడ్లు వితరణ

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : పట్టణంలోని పోలీస్‌స్టేషన్లకు వైసిపి పాతకోట బలరామిరెడ్డి 15 బారికేడ్లను ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ట్రాఫిక్ స్టేషన్‌లో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే పండుగ దినాలను దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ నియంత్రణకు బారికేడ్లను వితరణ చేసినట్లు తెలిపారు. జనాభా దృష్ట్యా ఎక్కువ ఉన్నందున ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులు చాలా కష్టపడాల్సి వస్తుందన్నారు. వీటి ద్వారా వారి శ్రమ కొంత తగ్గుతుందన్నారు. ట్రాఫిక్ సిఐ యుగంధర్, వన్ టౌన్ సిఐ రాజారెడ్డి, టూ టౌన్ సిఐ ఇబ్రహీం, పాతకోట శ్రీనాథరెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.


భోజనం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ఫైనాన్స్ మేనేజర్ వెంకటేష్‌బాబు

అనాథ వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక రాజీవ్ నగర్ కాలనీలో ఉన్న మదర్ థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలో శుక్రవారం అన్నదానం, పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. స్థానిక పులివెందుల రోడ్డులో ఉన్న శ్రీ హనుమాన్ ఆటో ఫైనాన్స్ మేనేజర్ చాగలేటి వెంకటేష్ బాబు పుట్టినరోజు వేడుకలను శుక్రవారం రాజీవ్ నగర్‌లోని అనాథ వృద్ధాశ్రమంలో నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచి పెట్టారు. ఈ సందర్భంగా చాగలేటి వెంకటేష్ బాబు మాట్లాడుతూ నిరుపేద వృద్ధులను తన వంతు ఆదుకోవాలనే తపనతో పుట్టిన రోజు వేడుకలను ఇక్కడ నిర్వహించామన్నారు. సేవ అనేది ప్రతి ఒక్కరిలో ఉండాలని కోరారు. వృద్ధుల బాగోగుల కోసం తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో స్నేహితులు మాస్, సాయికుమార్, బాబా హుస్సేన్, మహమ్మద్ రఫీ, రామకృష్ణ, ఆశ్రమ నిర్వాహకులు వెంకటసుబ్బయ్య, పాల్గొన్నారు.

విద్యుత్ లైన్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి - ముద్దనూరు

కడప-తాడిపత్రి ప్రధాన రహదారిలో ఉన్న ముద్దనూరు సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం ఆ శాక అధికారులు విద్యుత్ లైన్లు మరమ్మతులు, మార్పులు చేపట్టారు. ఈ కారణంగా మండల వ్యాప్తంగా ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. వాహనాల రాకపోకలకు కూడా అసౌకర్యం కలిగింది.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - జమ్మలమడుగు

జమ్మలమడుగు పట్టణంలో శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు జమ్మలమడుగు విద్యుత్ శాఖ డిఇఇ జి.రాజగోపాల్, జమ్మలమడుగు అర్బన్ విద్యుత్ శాఖ ఎఇ డి.రాజబాబు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. నేషనల్ హైవే లైన్ల మరమ్మతులు కారణంగా విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు. వ్యాపారస్తులు, రైతులు, పారిశ్రామికవేత్తలు, ప్రజలు సహకరించాలని వారు కోరారు.

చక్రాయపేట : మండలంలోని చక్రాయపేట, సిద్ధారెడ్డిగారిపల్లె, కె.ఎర్రగుడి సబ్‌స్టేషన్ 33/11కె.వి. మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం8.30 నుండి 11.30 వరకు మూడు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఎఇ ప్రవీణ్‌కుమార్ యాదవ్ తెలిపారు. ఆ సబ్ స్టేషన్ పరిధిలోని వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

చంద్రబాబు అరెస్టును ప్రతి ఒక్కరూ ఖండించాలి

ప్రజాశక్తి - చాపాడు

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అక్రమ అరెస్టును ప్రతి ఒక్కరూ ఖండించాలని దువ్వూరు టిడిపి మండలశాఖ అధ్యక్షులు వెంకటరమణారెడ్డి కోరారు. శుక్రవారం మైదుకూరులో టిడిపి నాయకులు తలపెట్టిన 3వ రోజు రిలే నిరాహార దీక్షలో దువ్వూరు మండల నాయకులు పాల్గొన్నారు. వీరికి జనసేన నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు దాసరి బాబు, మునిసిపల్ కౌన్సిలర్ రాధ, మైదుకూరు పట్టణ యూనిట్ ఇన్‌ఛార్జి రఫీ, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు మహేంద్ర, మున్సిపాలిటీ అధ్యక్షులు ప్రసాద్, ఉపాధ్యక్షులు నాయిని శ్రీకాంత్, ప్రభాకర్, గుడిపాటి భాస్కర్‌రెడ్డి, జనసేన క్రిష్ణమూర్తి, నాయకులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును వైసిపి ప్రభుత్వం కక్షపూరితంగా అరెస్టు చేసిందని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి అన్నారు. శుక్రవారం పులివెందులలోని టిడిపి కార్యాలయంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : అక్రమ అరెస్టులతో టిడిపి గెలుపును ఆపలేరని బనగానపల్లె ఇన్‌ఛార్జి బిసి జనార్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మూడవరోజు నిరసన దీక్షలను జమ్మలమడుగు ఇన్‌ఛార్జి చదిపిరాళ్ళ భూపేష్ సుబ్బరామిరెడ్డి పిలుపుమేరకు మాజీ ఎమ్మెల్సీలు దేవగుడి నారాయణరెడ్డి, శివనాథ్‌రెడ్డి ప్రారంభించారు. సాయంత్రం దీక్షలో ఉన్న వారికి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా శుక్రవారం రాత్రి టిడిపి నాయకులు కొవ్వొత్తుల వెలిగించి నిరసన చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మోహన్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, బయపురెడ్డి, బ్రహ్మానందరెడ్డి, సేట్, సంజీవరెడ్డి, ముస్లిం నాయకులు పాల్గొన్నారు. టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడం వైసిపి ప్రభుత్వానికి తగదని, ఇలాంటి చర్యలకు భయపడేవారు లేరని టిడిపి రాష్ట్ర బిసి కార్యదర్శి సుంకర నాగేశ్వరరావు అన్నారు. స్థానికంగా పార్టీ నాయకులు చేపట్టిన ఓ కార్యక్రమంలో బయపురెడ్డి, రాజారెడ్డి, షేట్, శివారెడ్డి, రమేష్‌రెడ్డి, సంజీవరెడ్డి, నరసింహారెడ్డి, కొండారెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, మహిళా కార్యకర్తలు సుభద్ర, భాగ్యమ్మ, దస్తగిరమ్మ పాల్గొన్నారు .

లోకేష్‌ను కలిసిన భూపేష్‌రెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ళ భూపేష్ సుబ్బరామిరెడ్డి, బద్వేలు టిడిపి నేతలు రితీష్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి గురువారం రాత్రి రాజమండ్రిలో టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ బాబును కలిశారు. చంద్రబాబు నాయుడు అరెస్టు తర్వాత వెళ్లి పరామర్శించారు. జైల్లో బాబు పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా బయటికి రావాలని వారు ఆకాంక్షించారు. నియోజకవర్గ స్థాయిలో ఇన్‌ఛార్జిలతోపాటు ముఖ్యనేతలు, సీనియర్లు ఉన్నారని పార్టీని పటిష్టపరిచేందుకు కృషి చేస్తామని, ధైర్యంగా ఉండాలని సూచించారు.


లోకేష్‌బాబుతో భూపేష్‌రెడ్డి, రితీష్‌రెడ్డి

ఓటు నమోదులో అవకతవకలను అరికట్టాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జరుగుతున్న ఓటు నమోదు ప్రక్రియలో అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకోవాలని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జెండాల మహబూబ్ బాషా, పార్టీ మైనారిటీ నాయకులు కమలాపురం గౌస్ మొహిద్దిన్ కోరారు. శుక్రవారం పుల్లూరు పంచాయతీ సర్వర్‌కాన్‌పేటలో దాదాపు 40 కొత్త ఓట్లు ఆన్‌లైన్ చేశారన్నారు. ఆ జాబితాను మైదుకూరులోని పార్టీ కార్యాలయంలో బిఎల్ఒ రవికి సమర్పించారు. కొత్తగా ఓటు నమోదు చేయడంలో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయని, వాటిని అరికట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఖాసీమ్‌పీరా, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థికి ఘన సన్మానం


బహుమతిని అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఎర్రగుంట్ల : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థి మహబూబ్ బాషాను పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. మహబూబ్ బాషా ప్రస్తుతం శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లో టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు రామాంజనేయులు తెలిపారు. బాలుర ఉన్నత పాఠశాలలో చదివి ప్రపంచమే గర్వించదగ్గ స్థానంలో పనిచేస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం మహబూబ్‌బాషాకు పిఎస్ఎల్‌వి నమూనా ప్రతిమను బహుకరించారు. ఉపాధ్యాయులు చంద్రఓబుల్‌రెడ్డి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.